క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా



సమావేశంలో మాట్లాడుతున్న గుప్త

కడ్తాల్: దళారులను నమ్మి మోసపోకుండా.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర రూ.2320 పొందాలని డీసీసీబీ డైరెక్టర్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా రైతులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రం సింగిల్‌విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమవేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆమనగల్లు ఆధ్వర్యంలో.. కడ్తాల్ మండల కేంద్రంతో పాటు, ముద్విన్ గ్రామంలో ఈ నెల 5న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, డైరెక్టర్ వీరయ్య, సీఈఓ దేవేందర్ ఉన్నారు.

సేవలను విస్తృతం చేస్తాం



గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ గుప్తాలను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: లయన్స్‌క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని లయన్ ఆఫ్ ఆమనగల్లు అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు పోతగళ్ల మహేశ్ ఆధ్వర్యంలో గోవర్ధన్‌రెడ్డితో పాటు, క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాస్ గుప్తాలను సన్మానించారు. ఈ సందర్భంగా లయన్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలతో పాటు పేద విద్యార్థులకు చేయూనందిస్తామని, వైద్య ఆరోగ్య శిబిరాలను నిరంతరం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, నర్సింహ, వెంకటేశ్, దాసు, కృష్ణ, సురేశ్, మహేశ్, రాములు, రాజేశ్, వేణు, అంజి తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ దీప్తి

మంచాల: ఆరోగ్యమే మహా భాగ్యమని, ఆహారం విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ దీప్తి అన్నారు. శుక్రవారం ఆరుట్లలో నిర్వహించిన వైద్య ఆరోగ్య శిబిరంలో ఆమె మాట్లాడారు. పోషకాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. ఘన పదార్థాలకంటే ద్రవ పదార్థాలను అధికంగా తీసుకోవాలని చెప్పారు. ఎండలో పని చేసే నీటిని బాగా తాగాలన్నారు. ఏ మాత్రం నీరసంగా ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని, వారి సూచన మేరకు చికిత్స చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఇందిర, వివిధ సంఘాల నాయకులు భాస్కర్, చంద్రయ్య, జంగయ్యగౌడ్, రాజు, జంగయ్య, విజయ్, శ్రవణ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బాబా

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గుర్రం గుట్ట కాలనీకి చెందిన పల్లె ఈశ్వరమ్మకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.24 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం లబ్ధిదారు కుటుంబ సభ్యులకు.. కేఎన్ఆర్ సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయ్‌రాథోడ్, ఎస్ఎస్‌యుబి రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, నాయకులు వెంకటయ్య, పరమేశ్, కొండల్‌రెడ్డి, శ్రీనునాయక్, సలీమ్, మహేశ్, శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణం.. నిరుపయోగం

- కొరవడిన పర్యవేక్షణ
- తుప్పపడుతున్న క్రీడా సామగ్రి
- పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న మైదానాలు
- ఆటలకు దూరమవుతున్న యువత



ఆరుట్లలో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

మంచాల: మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. లేని ప్రాంతాల్లో లేకపోగా.. ఉన్న చోట పర్యవేక్షణ కొరవడి అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. ఆటలకు అసౌకర్యంగా మారడంతో యువత మైదానాల వినియోగానికి ఆసక్తి చూపడం లేదని, దీంతో వ్యాయామ సామగ్రి తుప్పుపట్టి పోతుందని తెలిపారు.

12 గ్రామాల్లో..

మంచాల మండలంలోని 23 పంచాయతీలకు 12 గ్రామాల్లో గత ప్రభుత్వం ఒక్కో గ్రామానికి రూ.2 లక్షల నుంచి 3లక్షల చొప్పున వెచ్చించి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయించింది. మిగతా ప్రాంతాల్లో(లోయపల్లి, రంగాపూర్, ఆంబోత్ తండా, కొర్రంతండా, సత్తితండా, బోడకొండ, ఎల్లమ్మతండా, చీదేడ్) రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలు చూపించక పోవడంతో మైదనాలు ఏర్పాటు చేయలేదు. ఆస్మత్‌పూర్, కాగజ్‌ఘట్ గ్రామాల్లో స్థలం వివాదాల కారణంగా ప్రాంగణాలకు నోచుకోలేదు. ఏర్పాటు చేసిన చోట క్రీడా సామగ్రిని సమకూర్చినప్పటికీ, పర్యవేక్షణ లోపంతో ఆటగాళ్లను ఆకట్టుకోలేక పోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామీణ క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్ది వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం గ్రామానికో క్రీడ ప్రాంగణం ఏర్పాటు చేసింది. కానీ వాటిని పట్టించుకునే వారు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. అధికారులు స్పందించి వాటిని చదును చేయించి వినియోగంలోకి తేవాలి.

– చింతకింది వీరేష్ ముదిరాజ్, నోముల

నిధులు వస్తేనే..



గతంలో వచ్చిన నిధుల మేరకు గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయించాం. స్థలాలు లేని చోట ఏర్పాటు చేయలేదు. మరలా ప్రభుత్వం డబ్బులు ఏమీ ఇవ్వలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిగతా ప్రాంతాల్లో మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటు.. ఉన్నవాటిని చదును చేయిస్తాం.

– కె.వీరాంజనేయులు, ఏపీఓ, మంచాల

మోదీ నిర్ణయం చరిత్రాత్మకం

- బీజేపీతోనే అణగారిన వర్గాల అభివృద్ధి
- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి

ఆమనగల్లు: దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి అన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తూ.. శుక్రవారం పట్టణంలోని జాతీయ రహదారి రాజీవ్ కూడలిపై బీజేపీ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. ప్రధాని చిత్రపటానికి పుష్పాభిషేకం చేశారు. బాణసంచా కాల్చారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ కేంద్రం చేపట్టనున్న కులగణనతో ఓబీసీలు లబ్ధిపొందుతారని, వారి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కచ్చితమైన బడ్జెట్ కేటాయించేందుకు వీలుంటుందని తెలిపారు.

కాంగ్రెస్ మొసలి కన్నీరు

దేశాన్ని 48 ఏళ్ల పాటు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ.. వారి హయాంలో కులగణన ఎందుకు చేపట్టలేదని ఆచారి ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి తమతోనే సాధ్యమని చెప్పుకునే ఆ పార్టీ.. వారికోసం ఏం చేసిందన్నారు. ప్రతిపక్షంలో ఉండి బీసీల అభివృద్ధిపై మొసలి కన్నీరు కారుస్తుందని ఆరోపించారు. బీజేపీ 2014లో బీసీని ప్రధానమంత్రిని చేసిందని, కేంద్రమంత్రి వర్గంలో 27 మంది ఓబీసీలు, 12 మంది ఎస్సీలు, 8 మంది ఎస్టీలు, 5 మంది మైనార్టీలు ఉన్నారని పేర్కొన్నారు. 60శాతం మంది బడుగులకు మంత్రి వర్గంలో స్థానం కల్పించిన ఘనత బీజేపీదేనని స్పష్టంచేశారు. బీసీలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు కేకే శ్రీనివాస్, మున్సిపాలిటీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ కౌన్సిలర్లు శ్రీశైలంయాదవ్, చెన్నకేశవులు, శేఖర్, శ్రీదర్, లక్ష్మణ్, నర్సింహ, నాయకులు రవిరాథోడ్, ప్రశాంత్, శ్రీనివాస్, విష్ణుచారి, మహేశ్, నరేందర్, వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం నాదర్‌గుల్, తుర్కయంజాల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని శుక్రవారం ఏఈ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నాదర్‌గుల్, పార్వతిపురం, గైరాన్‌కోట, ఎంఎస్ఆర్ హోమ్స్, రాగన్నగూడ, కుర్మల్‌గూడ, ఎస్‌పిఆర్ హోమ్స్, ఇందిరానగర్, జన్నారం, ఆయుధాల గడ్డ, అగ్రికల్చర్ లైన్‌లో నిలిపివేయనున్నామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుర్రంగూడ, పోస్టల్ కాలనీ, గోల్డ్ ఫేజ్ కాలనీ, జక్కిడి సత్తిరెడ్డి కాలనీ, సావిత్రి అమ్మ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, శ్రీనివాసపురం కాలనీ, గాద్వి ఎన్‌క్లేవ్, వినాయక నగర్, శ్రీకృష్ణ కాలనీ, పంచాయతీ రాజ్ కాలనీ, బృందావనం కాలనీలో సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు.

తుర్కయంజాల్ ఫీడర్ పరిధిలో..

సినర్జీ హోమ్స్, ద్వారకానగర్, శోభానగర్, సిలికాన్ నగర్, ఆపిల్ సిటీ, ఏవీనగర్, వింటేజ్ హోమ్స్, యాదాద్రి హోమ్స్‌లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ వెల్లడించారు. అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆమనగల్లు: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో పర్యటించనున్నారని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే పాదయాత్రలో ఎమ్మెల్యే పాల్గొంటారని ఆయన తెలిపారు. అనంతరం ఆమనగల్లు పట్టణంలోని రైతువేదిక భవనంలో కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయనున్నారని పేర్కొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: మైసిగండిలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ శాంతి సందేశం, రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర చేపట్టనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొననున్నారని చెప్పారు.

నీటి ఎద్దడి లేకుండా చూడండి

యాచారం: వేసవి నేపథ్యంలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని మాజీ ఎంపీపీ కొప్పు సుకన్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో పలు గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే ఆయా గ్రామాల్లో పర్యటించి, నీటి సరఫరా అయ్యేలా చూడాలని కోరారు.

ఎమ్మెల్యే కసిరెడ్డి పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ నిట్టి నారాయణ మాతృమూర్తి లింగమ్మ.. మండల పరిధి గౌరారం గ్రామంలో గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం ఆమె భౌతికకాయం వద్ద పూలమాలలు ఉంచి నివాళి అర్పించారు. అనంతరం నారాయణను పరామర్శించారు. పరామర్శించిన వారిలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, అనురాధ, హరిప్రసాద్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య తదితరులు ఉన్నారు.

'ఫార్మా ప్లాట్ల కబ్జాలు చూపించండి'

యాచారం: ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులకు కేటాయించిన ప్లాట్లకు వెంటనే కబ్జాలు చూపించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ప్రభుత్వం పోలీస్ బందోబస్తు మధ్య సర్వే, ఫెన్సింగ్ పనులు పూర్తి చేస్తుంది కానీ, నాలుగేళ్ల క్రితం పంపిణీ చేసిన ఫార్మా ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేసి, కబ్జాలు ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కలెక్టర్, ఫ్యూచర్‌సిటీ కమిషనర్ స్పందించి కబ్జాలు చూపించాలని కోరారు. లేని పక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మీరాఖాన్‌పేటలోని టీజీఐఐసీ మెగా వెంచర్ వద్ద ఆందోళన, ధర్నా నిర్వహిస్తామని నర్సింహ హెచ్చరించారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం న్యాయవాదులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంకు మురళీ, ప్రధాన కార్యదర్శిగా రవికిరణ్, ఉపాధ్యక్షులుగా మంద మహేందర్, అంబాచారి, సంయుక్త కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా మిర్యాల జగన్, స్పోర్ట్స్ కల్చరల్ కార్యదర్శిగా ఆర్.వెంకటేశ్, లైబ్రేరియన్‌గా నాగరాజు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా బానుగౌడ్, రాజ్‌కుమార్‌లను నియమించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మోకిల్ల శ్రీనివాస్‌రెడ్డి, వెదిరే వేణుగోపాల్‌రెడ్డి, పి.రాములు, డి.జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు

హజ్‌యాత్రికుడికి సన్మానం

ఆమనగల్లు: హజ్‌యాత్రకు వెళ్తున్న ముంతజీర్‌ను శుక్రవారం పట్టణంలోని మసీదులో మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఇమామ్ జఫర్ రజా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు పాషా, బడేసాబ్, మహబూబ్‌అలీ, జహంగీర్, అయ్యూబ్, అబ్దుల్ రెహమాన్, మక్సుద్ అలీ తదితరులు ఉన్నారు.



ముంతజీర్‌ను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

అభివృద్ధి పనుల్లో నాణ్యత డొల్ల

- అధికారుల నిర్లక్ష్యం..
- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- లీకవుతున్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు



భువనేశ్వరినగర్ కాలనీలో లీకవుతున్న మురుగునీరు

అబ్దుల్లాపూర్‌మెట్: కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం.. అధికారుల నిర్లక్ష్యం. వెరసి అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడింది. ఫలితంగా ప్రజాధనంతో నిర్మించిన పనుల్లో డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోంది. అభివృద్ధి పనులు కొనసాగుతున్న సమయంలో నాణ్యతను పరిశీలించాల్సిన అధికారులు, సిబ్బంది.. కాంట్రాక్టర్లతో చేతులు కలిపి పనులను పర్యవేక్షించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఆరునెలలకే లీకేజీ

పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలో 5వ వార్డు భువనేశ్వరీనగర్ కాలనీలో సర్వే నంబర్ 470లోని కాలనీల్లో ఆరు నెలల క్రితం రూ.లక్షలు వెచ్చించి భూగర్భ డ్రైనేజీ నిర్మాణం చేశారు. ఈ పనుల్లో నాణ్యత లేకపోవడంతో అనతి కాలంలోనే పైపు లైన్లు లీకై మురుగు జలాలు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. తీవ్ర దుర్వాసన వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. ఇదే విషయమై.. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రజాధనం వృథా..

అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడింది. సీసీరోడ్లు, డ్రైనేజీ, కమ్యూనిటీ భవనాల నిర్మాణాల్లో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. ఫలితంగా ఆయా నిర్మాణాలు అనతి కాలంలోనే ధ్వంసమవుతున్నాయి. ప్రజాధనం వృథా అవుతోంది. అధికారులు స్పందించి, నిర్మాణాల్లో నాణ్యతపై దృష్టి సారించాలి.

– యంజాల ప్రహ్లాద్, బీఎస్పీ నాయకుడు

'పది'లో పతనం

- పేలవంగా టెన్త్ ఫలితాలు
- భారీగా తగ్గిన ఉత్తీర్ణత శాతం
- 350 మందికి 181 మంది పాస్
- గతేడాది 93 శాతం.. ప్రస్తుతం 51.70 శాతం

'సర్కారు బడుల్లో ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్నాం. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ.. అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం' అని ఏడాది పొడవునా చెప్పే ఉపాధ్యాయ బృందం మాటల్లో ఎంత వాస్తవముందో తెలియదు కానీ.. మొన్న వెలువడిన పది ఫలితాల్లో కడ్తాల్ మండలం పూర్తిగా వెనుకబడింది. గతేడాదితో పోలిస్తే.. సగానికి సగం ఉత్తీర్ణత శాతం తగ్గి విస్మయానికి గురిచేసింది.



ఎక్వాయిపల్లి ఉన్నత పాఠశాల (30 మందికి 8 మంది ఉత్తీర్ణత)

కడ్తాల్: 2024–25 పదో తరగతి వార్షిక ఫలితాలను పరిశీలిస్తే.. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన కొరవడిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 51.70 శాతానికి తగ్గి.. ప్రజల్లో సర్కారు బడులపై విశ్వాసం సన్నగిల్లేలా చేసింది. నాణ్యమైన విద్య అందాలన్నా, ఉత్తమ ఫలితాలు రావాలన్నా బోధన ఎంత ముఖ్యమో, పర్యవేక్షణ అంతే ముఖ్యం. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ సవ్యంగానే ఉండి, ప్రత్యేక తరగతులు నిర్వహించినా జరగవలసిన నష్టం జరిగిపోయింది.

టీచర్ల కొరత లేకున్నా..

సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల కొరత లేకున్నా.. పదిలో పతనానికి కారణమేమిటని విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు మదనపడుతన్నారు. మండలంలో పరీక్షల నిర్వహణ పకడ్బందీగా జరిగిందని పేర్కొంటున్న ఆ శాఖ అధికారులు, మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించకపోవడమే ఉత్తీర్ణత శాతం తగ్గడానికి కారణమని పలువురు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. ఉపాధ్యాయులు సంఘాల నాయకులుగా ఉండటం, సంఘాల పేరిట సభ్యత్వ నమోదు, వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టడం, సభలు, సమావేశాలకు వెళ్లి, పాఠశాలలకు దుమ్మా కొట్టడం నిత్యం జరుగుతోంది. ఉపాధ్యాయుల గైర్హాజరును అరికట్టేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడం, కొన్ని పాఠశాలలో టీచర్లు వేళకు రాకపోవడం, విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించకపోవడంతో పాటు, వారిపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో పదిలో పేలవమైన ఫలితాలు వచ్చాయన్నా ఆరోపణలు లేకపోలేదు. విద్యార్థి సంఘాల తరగతుల బహిష్కరణ కూడా దీనికి తోడయిందంటున్నారు.

పాఠశాలల వారీగా..




ముద్విన్ ఉన్నత పాఠశాల (40 మందికి ఆరుగురు పాస్)

ఈ ఏడాది టెన్త్‌లో ఉత్తీర్ణత శాతం భారీగా తగ్గింది. పాఠశాలల వారీగా ఫలితాలు ఇలా ఉన్నాయి. ఎక్వాయిపల్లి ఉన్నత పాఠశాలలో 30 మంది పరీక్ష రాయగా.. 8 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. రావిచేడ్‌లో 32 మందికి 23 మంది, కడ్తాల్ బాలికల ఉన్నత పాఠశాల తెలుగు మాధ్యమంలో 20 మందికి 6 మంది, ఇంగ్లిష్ మీడియంలో 43 మందికి 35 మంది, ముద్విన్‌లో 40కి 6గురు, చరికొండలో 22 మందికి 7 మంది, కడ్తాల్ బాలుర ఉన్నత పాఠశాలలో 82 మందికి 38 మంది, మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 47కు 36 మంది, మండల కేంద్రంలోని కేజీబీవీలో 34 మంది విద్యార్థినులకు 28 మంది గట్టెక్కారు.

విస్తుగొలిపిన ఫలితాలు

2024– 25 విద్యా సంవత్సరం పది ఫలితాలు విస్తుగొలిపాయి. 350 మంది పరీక్ష రాయగా.. కేవలం 181 మంది (51.70 శాతం) మాత్రమే పాసయ్యారు. 169 మంది ఫెయిల్ అయ్యారు. 2023– 24 ఏడాదిలో 384 మంది విద్యార్థులకు 358 మంది(93 శాతం) ఉత్తీర్ణత సాధించగా, ప్రస్తుత సంవత్సరం ఫలితాలు సగానికి పైగా తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యాశాఖ.. బాలబాలికలకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు, వారికి ఇబ్బంది కలగకుండా మౌలిక వసతులను కల్పించింది. అయినా టెన్త్‌లో 50 శాతం మందే ఉత్తీర్ణత సాధించడం ఆవేదనకు గురిచేస్తోంది.

పరిశీలిస్తున్నాం..



పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గడంపై పూర్తి స్థాయిలో పరిశీలిస్తాం. ఫెయిల్ అయిన విద్యార్థులను అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. మెరుగైన ఫలితాలు సాధించేలా దృష్టి సారించాం. ఇందులో భాగంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహిస్తాం. అత్యుత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా ప్రణాళికలు రూపొందిస్తాం.

– సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎంఈఓ, కడ్తాల్

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం

- విరిగిపడిన పోల్
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: గుర్తు తెలియని వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగి రోడ్డుపై పడడంతో విద్యుత్, కేబుల్ వైర్లు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున పట్టణంలోని ఈశ్వరాంజనేయ స్వామి ఆలయం వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణం నుంచి రాయపోల్ వెళ్లే మార్గంలోని ఈశ్వరాంజనేయ ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం స్తంభాన్ని ఢీకొట్టింది. ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో బస్తీవాసులు భయాందోళనకు గురయ్యారు. జనసంచారం లేని సమయంలో ఘటన చోటు చేసుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. సాయంత్రం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



రోడ్డుపై పడిన స్తంభం, వైర్లు